ప్రజాశక్తి
బుధవారం 18 సెప్టెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు వేస్తున్న కలెక్టర్

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

కలెక్టర్ తమీమ్ అన్సారియా 8లో

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

ఐద్వా డిమాండ్ 5లో

దర్శిలో రాజకీయ ఉద్రిక్తత

- పోలీసుల తీరుకు వ్యతిరేకంగా బూచేపల్లి నిరసన
- 144 సెక్షన్ విధించిన పోలీసులు
- జడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే హౌస్ అరెస్టు
- వైసిపి కార్యకర్తలు రాకుండా కట్టడి
- ఇంటి నుంచే బూచేపల్లి ఆందోళన



ప్లకార్డులతో ఇంటి వద్దే నిరసన తెలుపుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ..

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. అక్కడ వైసిపి, తెలుగుదేశం గ్రూపుల మధ్య గ్రామాల్లో నిప్పూఉప్పూగా పరిస్థితి తయారైంది. ఏ చిన్న కార్యక్రమం జరిగినా రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. తాజా వినాయక విగ్రహాల ఊరేగింపు సందర్భంగానూ పలుచోట్ల రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు జరిగాయి. పోలీసుల కేసుల వరకూ వెళ్లాయి. వైసిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి నేరుగా ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని పార్టీల పరంగా కార్యకర్తలను కాపాడుకునే పనిలో ఉన్నారు. దీంతో మరింత ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పట్ల పోలీసుల తీరు వివాదాస్పదంగా మారింది. ఇక్కడ నేతలు నేరుగా తలపడకపోయినా పోలీసుల వైఖరితో తాజాగా దర్శిలో పరిస్థితి ఉద్రికత్తలకు దారితీసింది. దర్శి సిఐ, తాళ్లూరు ముండ్లమూరు, దర్శి ఎస్ఐల తీరుకు నిరసనగా ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మంగళవారం నాడు దర్శిలో పార్టీ పరంగా నిరసనకు పిలుపునిచ్చారు. ఈ నిరసనకు కారణాలను పరిశీలిస్తే.. దర్శి మండలం, బొట్లపాలెంలో బూచేపల్లి కారుకు తెలుగుదేశం కార్యకర్త ఒకరు మోటారు సైకిల్‌ను అడ్డుపెట్టారు. చాలా సేపు తీయలేదంటున్నారు. సమాచారం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు అక్కడికి చేరుకుని బండిని పక్కకు లాగేశారు. కార్యకర్తను కూడా పక్కను నెట్టేయడంతో బూచేపల్లి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే తెలుగుదేశం కార్యకర్తతో వైసిపి నేతపై కేసు పెట్టించారు. స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీసులు తమ మార్కు చూపించారు. ఈ వ్యవహారాన్ని బూచేపల్లి కూడా సీరియస్‌గా తీసుకున్నారు. తన కారుకు అడ్డుకున్న తెలుగుదేశం కార్యకర్తను వదిలేసి తమ నాయకుడిపై కేసు పెట్టడం సరికాదన్నారు. తన కారుపై టిడిపి కార్యకర్తలు దాడి చేసే యత్నం చేశారని దర్శి సిఐకి ఫోన్‌లో చెప్పారు. దీనిపై సిఐ రామారావు ఎమ్మెల్యేతో అనుచితంగా, అవమానకరంగా మాట్లాడారని చెబుతున్నారు. వైసిపి కార్యకర్తలను కొట్టడం, కేసులు పెట్టడం, ప్రశ్నిస్తే అవమానకరంగా మాట్లాడుతున్నారంటూ 2లో



144 సెక్షన్ నేపథ్యంలో పోలీసుల బందోబస్తు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

- స్వచ్ఛతా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలి
- కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, పరిశుభ్రమైన భారతదేశాన్ని రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎండిఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏర్పాటుచేసిన గాంధీజీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు కలెక్టర్ వెంకటమురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ అమలులో ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛతా హీ భాగీధారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి కర్మచారి సుభిక్ష కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తడి చెత్తకు కుళ్లిపోయే స్వభావం ఉన్నందున రీసైక్లింగ్ ద్వారా ప్రకతికి ఎంతో ఉపకరించే ఎరువుగా మార్చవచ్చన్నారు. ఈ ప్రక్రియను అధికారులు సమర్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్, ఇనుప వస్తువులు పొడి చెత్త పరిధిలోకి వస్తాయన్నారు. వాటిని సైతం రీసైక్లింగ్ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పొడి చెత్త, తడి చెత్తను వేరుపరచడం ప్రతి ఇంటి వద్ద ప్రారంభం 2లో

వైద్య శాఖపై 15 రోజులకోసారి సమీక్ష

- ఆసుపత్రులలో పారిశుధ్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి 15 రోజులకు ఒక సారి వైద్యశాఖపై సమీక్ష నిర్వహిస్తానని, జిల్లాలోని ఆసుపత్రులలో పారిశుధ్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ కేటగిరీల ప్రభుత్వ ఆసుపత్రుల ఉన్నతాధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా ఆసుపత్రుల వారీగా ఉన్న సిబ్బంది, నిధుల కేటాయింపు, పారిశుధ్యం, భద్రత, వివిధ పనులలో పురోగతి, హెచ్‌డిఎస్ నిధుల లభ్యత, ఎన్టీఆర్ వైద్యసేవలు లభిస్తున్న తీరు, ఎంప్యానల్‌మెంట్ సమస్యలు మెడిసిన్-సర్జికల్స్ లభ్యత వంటి అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించటంతో పాటు వైద్యులకు రక్షణ విషయంలోనూ, మహిళా ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో డిఎం,హెచ్ డాక్టర్ డి.సురేష్ కుమార్, డిసిహెచ్ఎస్ శేషుకుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గా దేవి, ఎన్టీర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.హేమంత్, డిఐఒ పద్మజ, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డాక్టర్ భగీరధి, డిపిఎంఒ వాణిశ్రీ, మాతాశిశు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, అన్ని కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు, ఎపిఎంఎస్ఐడిసి అధికారులు పాల్గొన్నారు.

దర్శిలో రాజకీయ ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులపైనే ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగానే మంగళవారం నాడు ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బూచేపల్లి ఆందోళనకు పిలుపునివ్వడంతో పోలీసులు వెంటనే దర్శిలో 144 సెక్షన్ విధించారు. మండలాల నుంచి వైసిపి కార్యకర్తలను దర్శికి రాకుండా కట్టుదిట్టం చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. పట్టణానికి నాలుగు వైపులా ఉన్న రహదారులను దిగ్బంధనం చేశారు. అయినా వైసిపి కార్యకర్తలు మోటారుసైకిళ్లతో బూచేపల్లి ఇంటికి చేరుకున్నారు. గృహనిర్బంధం చేస్తున్నట్లు బూచేపల్లికి పోలీసులు ముందుగానే నోటీసులు జారీ చేశారు. బయటకు రావడానికి అనుమతి లేదని చెప్పారు. దీంతో తన ఇంటికి చేరుకున్న కార్యకర్తలతో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అక్కడ నుంచే నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. పోలీసులు కూడా ఆయన ఇంటివద్దకు చేరుకొని బయటకు రాకుండా చూశారు. పోలీసులపై విచారించి చర్యలు తీసుకోవాలని, ఇదే తీరున కార్యకర్తలపై దాడులు, కేసులు పెడితే ఆందోళన తీవ్రతరం చేస్తామని బూచేపల్లి హెచ్చరించారు. దర్శిలో ఎప్పుడూ లేని విధంగా ఉద్రిక్తతలు నెలకొనడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

దేకనకొండలో ముదిరిన వివాదం

ప్రజాశక్తి- కురిచేడు

కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఇరు గ్రూపుల మధ్య చెలరేగిన వివాదం చివరకూ పెను తుఫానుగా మారింది. ఇనే గ్రూపుల చెందిన 20 మందికిపైగా గాయాలయ్యాయి. ఈ ఘటనలో 40 మందిపై కేసులు నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేశారు. ఘర్షణకు పాల్పడిన వారిలో ఇరవై మందిని అరెస్టు చేసి దర్శికోర్టులో హాజరు పరిచారు. వారికి న్యాయమూర్తి 15 రోజులపాటు రిమాండ్ విధించారు. మరో ఇరవై మందిని కనిగిరి కోర్టులో హాజరు పరచగా జడ్జి వారికి 15 రోజుల పాటు రిమాండ్ విధించారు. వారిని ఒంగోలు సబ్‌జైలుకు తరలించారు. తమ కార్యకర్తలపై పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేశారంటూ వైసిపి నాయకులు ధర్నా దిగారు. ఇప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న దర్శి నియోజకవర్గం భగ్గుమంటోంది. ఎప్పుడు ఎలాంటి ఘటన చోటు చేసుకుందనే చర్చ నడుస్తోంది. ఇరువర్గాల ఘర్షణ సందర్భంగా త్రిపురాంతం సిఐ సుబ్బారావు ఓ గ్రూపువారికి కొమ్ముసాడనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు విఆర్‌కు పంపారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

దర్శి : తాళ్లూరు మండలంలోని తూర్పు గంగవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన విద్యావిధానంపై చర్చించారు. ఈ సమావేశంలో పాఠశాల సముదాయ చైర్మన్ చిడిపోతు అరుణకుమారి, ఎంఇఒలు జి.సుబ్బయ్య, జి.సుధాకర్, సిఆర్‌పి బి.శ్రీనిసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

కావాలని సూచించారు. చెత్త నిర్వహణపై ప్రజల్లో మార్పు రావాలని ఆయన సూచించారు. చెత్తను సక్రమంగా విడదీసి పరిశీలించకపోతే జలవనరులు కలుషితమై, జలాశయాలు దెబ్బతింటాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పాఠశాలలు, రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ సెంటర్ లు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. రాబోయే భవిష్యతు తరాలకు మంచి ప్రకతిని ఇవ్వాలని, మంచి సమాజం నిర్మిద్దామని సూచించారు. భారతదేశాన్ని పచ్చగా చేయడానికి ప్రధానమంత్రి మోడీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ 2026 సంవత్సరం వరకు కొనసాగ ుతుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవడానికి 400 సంవత్సరాలు సమయం పడుతుందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని క్రమేపి పూర్తిగా తగ్గించాలన్నారు.

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ప్రజలంతా బాగుండాలి, ఆరోగ్యమైన సమాజం నిర్మించడానికి ప్రధానమంత్రి మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాలను చేపట్టారన్నారు. .ప్రజల ఆయుష్షు పెరగాలంటే ప్రకృతి సహకరించేలా పర్యావరణం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలుషితమైన నీటిని, ఉప్పునీటిని శుద్ధ జలంగా మార్చి వినియోగించుకునేలా ఎస్ టి బి ప్లాంట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. 15 రోజులపాటు పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలు అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని డిపిఒ రవికుమార్ తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను కార్మికులు చిత్తశుద్ధితో నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం శివకష్ణ, డిఆర్‌డిఎ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సీతారాం మృతి తీరని లోటు

సిపిఎం మార్కాపురం డివిజన్ కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య

ఘనంగా నివాళులర్పించిన నేతలు

ప్రజాశక్తి-తర్లుపాడు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని మార్కాపురం డివిజన్ సిపిఎం పార్టీ కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య అన్నారు. మండల కేంద్రమైన తర్లుపాడు పొట్టి శ్రీరాములు పార్కు నందు రైతు సంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాపం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలనాగయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల వ్యాప్తికి అలుపెరగని పోరాటం సాగించారన్నారు. సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి చేశారని కొనియాడారు. ఫాసిస్ట్, మతతత్వ శక్తులు పెచ్చురిల్లుతున్న కాలంలో వామపక్షానికి, దేశానికి దిక్సూచిగా నిలవాల్సిన ఏచూరిని ఈ దేశం కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్షులు నాగరాజు, పలువురు సిపిఎం నేతలు, రైతు సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



తర్లుపాడులో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



పేర్నమిట్టలో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి ఉన్నత కుటుంబంలో జన్మించినా కార్మిక సిద్ధాంతం వైపు ఆకర్షితులై 1975లో మార్క్సిస్టు పార్టీలో చేరి తన తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన 1985లో కేంద్ర కమిటీ సభ్యునిగా, 1992లో పోలిట్ భ్యూరో సభ్యునిగా, 2015లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపికై చివరి వరకు ఆ పదవిలో కొనసాగారని అన్నారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా, అంతర్జాతీయ సంబంధాలను కొనసాగించిడంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒడిదుడుకులు వచ్చిన సందర్భంలో మార్క్సిజానికి అపజయం లేదని, దాన్ని అమలు చేయడంలోనే లోపాలు జరిగాయని దాన్ని సరిచేసుకొని ముందుకు పోవడానికి అంతర్జాతీయ కమ్యూనిస్టులు అందరినీ ఒక చోట చేర్చి విశ్వాసం కలిగించడానికి కావాల్సిన ప్రయత్నం చేశారని తెలిపారు. దేశంలో లౌకిక కూటముల్ని ఏర్పాటు చేసే విషయంలో, ప్రజల సంక్షేమం కోసం కామన్ మినిమం ప్రోగ్రాం తయారీలో కీలక పాత్ర పోషించారన్నారు. సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా తుదికంటూ పోరాడారని అన్నారు. ఆయన లేని లోటు కమ్యూనిస్టు ఉద్యమానికి దేశంలో పోరాడే శక్తులకు, అభ్యుదయ, లౌకిక వాదులకు తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.వి.రమణారావు, ఏ.వి.సుబ్బారావు, డి.చిన్నబాబు, ఏ.కోటేశ్వరరావు, టి.సుబ్బారావు, పి.చిన్నశేషయ్యతదితరులు పాల్గొన్నారు.

ముంగమూరులో ఏచూరి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం గ్రామ సీనియర్ నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్, ఏ బ్రహ్మయ్య, టి.రాము, ఎస్.కె నాగూర్, ఎన్ వి శేషయ్య, ఎ.రవిచంద్ర, ఎ.రమణమ్మ, ఎ.బసవమ్మ, కె.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్:

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ మార్కాపురం పట్టణంలో సుందరయ్య కాలనీలో సీపీఎం కార్యదర్శి బి.కాశయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య మాట్లాడుతూ తుది శ్వాస వరకు రాజీలేని పోరాటాలను చేసిన నేత అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వీరనారాయణ, క్షాశయ్య, నాగరాజు, అశోక్, విజయ్, దేవరాజ్, దాసు, మరియమ్మ, దేవమ్మ, యవనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భవనం పైనుంచి జారిపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని వెన్నెల అపార్ట్‌మెంట్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు ఎర్రంరెడ్డి చెన్నారెడ్డి(65) అనే వృద్ధుడు మంగళవారం నీరు పడుతూ జారిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. కనిగిరి మండలం పునుగోడుకు చెందిన వృద్ధుడు ప్రమాదవశాత్తు జారిపడి తలకు బలమైన గాయం అయి అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతుని తమ్ముడు ఎర్రం రెడ్డి అంకిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన చెన్నారెడ్డి

రైజ్ కళాశాలలో డిజైన్‌పై వర్కుషాపు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం ఈసిఈ విభాగానికి చెందిన విద్యార్థులకు పిసిబి డిజైన్‌పై రెండు రోజులు జరిగిన వర్కు షాపు మంగళవారం ముగిసింది. నరేష్ టెక్నాలజీ అండ్ కన్సోలేటిస్ సర్వీస్ డైరెక్టర్ ఎస్‌వి. నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, గౌరవ ఛైర్మెన్ ఇస్కాల చిన రంగమన్నార్, హెచ్‌ఓడి ఎస్‌వి రవికుమార్, ప్రొఫెసర్ ఎస్.చంద్ర శేఖర్, వర్కు షాపు కోఆర్డినేటర్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జనార్ధన రెడ్డిని కలిసిన సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మర్యాద పూర్వకంగా కలిశారు. కొండపి నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి సత్య మంత్రి జనార్ధన రెడ్డితో చర్చించారు.



మంత్రి జనార్దనరెడ్డితో సత్య

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని శ్రీ హర్షిణి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన వర్ధిముక్కల ధనలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. ఈమె భర్త శ్రీనివాసరావు 10 ఏళ్ళ క్రితం మరణించారు. ధనలక్ష్మి టైలరింగ్ చేసుకుంటూ కుమార్తెలు ఇద్దరిని పోషిస్తుంది. పెద్ద కుమార్తె తల్లికి సాయంగా పనులు చేస్తూ ఉంటుంది. చిన్న కుమార్తె వర్ధిముక్కల భావన(16) శ్రీ హర్షిణి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి(జెఇఇ మెయిన్స్) చదువుతోంది. ఇటీవల ఇంటికి వెళ్ళిన భావన అక్కతో పాటు సోమవారం మధ్యాహ్నం కళాశాలకు వచ్చింది. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో కళాశాల హాస్టల్ ఐదో అంతస్తుపై చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని విద్యార్థినులు గమనించి కళాశాల యాజమాన్యానికి చెప్పటంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం విద్యార్థిని మృతదేహాన్ని కిందకు దించారు. ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు, సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని కళాశాల యాజమాన్యం, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినాయక నాకు ట్రిపుల్ ఐటి సీటు రావాలని విద్యార్థిని రాసినట్లు ఉన్న పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని తల్లి, బంధువులు కళాశాలకు చేరుకొని భావన భౌతిక కాయాన్ని చూసి కళాశాల యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులు కల్పించుకొని విద్యార్థిని కుటుంబాన్ని కళాశాల యాజమాన్యం ఆదుకుంటుందని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. అనంతరం విద్యార్థిని మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు ఈ కేసును అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్

విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి
ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ డిమాండ్

ఒంగోలు శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని వర్ధిముక్కల భావన ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. సిహెచ్ వినోద్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని భావన భౌతిక కాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ భావన ఈనెల 16న మధ్యాహ్నం ఇంటి నుండి హాస్టల్ కు వచ్చిందని, మంగళవారం ఉదయం 5గంటలకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారన్నారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకొని చనిపోవడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. విద్యార్థిని ఆత్మహత్య కారణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను తెలపాలని కోరారు.



మాట్లాడుతున్న పద్మావతి

పాఠశాలలో రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుల తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి స్థానిక గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి సమిష్టి కృషితో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.రమాదేవి తమ పాఠశాల ఆవరణంలో విద్యుత్ అసౌకర్యంతో పాటుగా కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. శింగరాయకొండ పరిసర ప్రాంతాల్లో పాఠశాలకు తరచుగా గైర్హాజరు అవుతున్న విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, బాల కార్మికులు, బాల్యవివాహాలు, ఫోక్సో కేసులు నమోదు, చైల్డ్ అబ్యూజింగ్, బాలలు డ్రగ్స్‌కి బానిసవ్వడం లాంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. విద్యార్థులపై పర్యవేక్షణతో పాటుగా ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టికాహారం ఇస్తూ క్రమశిక్షణ కూడిన విద్యను అందజేయడం వల్ల మంచి సమాజాన్ని ఏర్పాటు చేద్దామని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ తహసీల్దార్ టి.రవి, మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు, సీడీపీవో మల్లేశ్వరి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ వీరాంజనేయులు, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని మర్రిచెట్లపాలెం విద్యుత్ సెక్షన్‌లో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ అబ్దుల్ కరీంలు దాడులు నిర్వహించి రూ.4,15,000 అపరాధ రుసుం విధించారు. ఈ దాడులలో ఏకకాలంలో 41 టీములు పాల్గొన్నాయి. మూడు సర్వీసులు నేరుగా కరెంట్ వాడుతున్నారన్నారని వారు తెలిపారు. 13 సర్వీసులు అదనపు లోడులు వాడుతున్నారనీ గుర్తించారు. వీరిపై రు.4,15,000లు అపరాధ రుసుం వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి డిఈఈ వెంకటకృష్ణారెడ్డి, దర్శి డిఈఈ కె పిచ్చయ్య, పొదిలి డిఈఈ కె శ్రీనివాసరావు, చీమకుర్తి ఏఈ వి శ్రీనివాసరావు,దర్శి డివిజన్ లోని ఏఈలు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని శింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య అన్నారు. మంగళవారం శింగరాయకొండ రైల్వే రోడ్లో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న యువకులను, వాహనాలను పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. వీరి వెంట ఎస్ఐ బి.మహేంద్ర, ఏఎస్ఐ షేక్ మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

ఎనర్జీ స్టోరేజ్ క్యాపిటల్‌గా ఎపిని మార్చుతాం

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

ఎపిని ఎనర్జీ స్టోరేజీ క్యాపిటల్‌గా మార్చుతామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్-2024'లో ఆయన మంగళవారం మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరులను వివరించారు. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు



రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్‌లో మంత్రి గొట్టిపాటి

నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దీనితో పాటు విద్యుత్ స్టోరేజి సాంకేతికత వినియోగిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజి విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్‌ను కేరాఫ్‌గా నిలిపే లక్ష్యంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున బ్యాటరీ స్టోరేజి విధానం, పంప్ హైడ్రో స్టోరేజి, ఇతర అభివృద్ధి చెందిన విద్యుత్ స్టోరేజి సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ- సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.


ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న కార్యదర్శి సుబ్బారావు

ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

ఐక్యత పోరాటాల ద్వారానే అనేక కార్మిక సమస్యలు పరిష్కరిష్కారానికి ఫెడరేషన్ కృషి చేసినట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి డిఎవి సుబ్బారావు పేర్కొన్నారు. 1979 సెప్టెంబర్ 16న ఎపిఎస్ ఆర్టీసీలో సిఐటియుకు అనుబంధంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ ఏర్పాటు చేశారు. నాడు ఐక్యత, పోరాటం నినాదంతో ఆర్టీసీలో ఫెడరేషన్ ఆవిర్భవించింది. ఫెడరేషన్ ఆవిర్భావం సందర్భంగా డిపో ఆవరణలో మంగళవారం జండా విష్కరించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి పి తిరుపతిరెడ్డి, కె కామేశ్వరరావు, డివికె రెడ్డి, రత్న కుమార్, బీబిజాన్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం రావినూతల కార్యదర్శిగా ఎడ్ల రవి

ప్రజాశక్తి - మెదరమెట్ల

సిపిఎం గ్రామ మహాసభలో గ్రామ నూతన కార్యదర్శిగా ఎడ్ల రవిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత మూడేళ్లుగా శాఖ పనితీరును సమీక్షించారు. మంచినీటి ట్యాంకు నుండి సపరేట్‌గా వాటర్ లైన్‌ను పల్లె వరకు ఇవ్వాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కొత్తచెరువు భూములు దళితులకు చెందినవి తిరిగి దళితులకే అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం ఆంజనేయులు, సీనియర్ సభ్యులు బొంతు దశరథ పాల్గొన్నారు.


కార్యదర్శిగా ఎడ్ల రవి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న పాస్టర్ దేవదాసు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - చీరాల

గత మార్చి ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల ఆవరణలో మంగళవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు అధ్యక్షత వహించిన సభలో రిటైర్డ్ లైబ్రేరియన్ పూల్లగూర జయాశీలరావు తన తండ్రి పూల్లగూర జయరావు, సలగల ఇజ్రాయేలు జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా జయశీలరావు మాట్లాడుతూ బిడ్డలు తల్లి, దండ్రుల ప్రేమకు ప్రతిరూపాలని అన్నారు. అటువంటి పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు ఆ తల్లిదండ్రుల సంతోషానికి అవధులు ఉండవని అన్నారు. తమ తల్లి, దండ్రులు వారి పట్ల చూపిన ప్రేమాభిమానాల వలన ఈరోజు తాము ఈ స్థాయిలో ఉండగలిగామని తెలిపారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత స్థితికి రావాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి నగదు పురస్కారాలు అందుకోవాలని అన్నారు. ఎంపిసిలో ఐశ్వర్య, థెరిస్సా ప్రథమ, ద్వితీయ, సిఇసిలో రాజేష్, వెంకట సాయి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో పురస్కారాలు అందుకున్నారు.

వైసిపి బనాయించిన అక్రమ కేసులు తొలగింపు

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - ఇంకొల్లు

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా బనాయించిన 25 కేసులను చట్ట పరంగా రద్దు చేసినట్లు శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు మంగళవారం ప్రకటించారు. టిడిపి కార్యకర్తలపై నియోజకవర్గంలో 50కేసులు వైసిపి ప్రభుత్వం అక్రమంగా వివిధ సందర్భాల్లో నమోదు చేసినట్లు తెలిపారు. ఆ 50 కేసుల వివరాలు తెప్పించుకొని హెూం మంత్రి అనితతో చర్చించినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన కేసు వివరాలు అందించినట్లు తెలిపారు. ఈ కేసుల్లో ఎలాంటి సాక్షాలు, ఆధారాలు లేకుండా అక్రమంగా బనాయించిన


హెూం మంత్రితో మాట్లాడుతున్న ఏలూరి

25కేసులను చట్టపరంగా వెంటనే తొలగించినట్లు ప్రకటించారు. మిగిలిన కేసుల్లో కూడా సాక్ష్యాధారాలు సేకరించి నిజానిజాలు నిగ్గుతేల్చనున్నట్లు తెలిపారు.

ఓజోన్ ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో అంతర్జా తీయ ఓజోన్ దినోత్సవం జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు అధ్యక్షతన మంగళవా రం నిర్వహించారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను, విద్యాలయా ల, పర్యావరణ సమతుల్యతకు వ్యక్తిగత కృషిని గూర్చి వివరించారు. డాక్టర్ ఎస్‌కె మస్తాన్‌వలి, వి రామకృష్ణ, బి అశోక్ కుమార్ మాట్లాడారు. కళాశాలలో ప్రతి 6నెలకు ఒకసారి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పట్టణ వైద్యాధికారుల పరిరక్షణ, సహకారంతో నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ స్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ సిహెచ్ అనిత, డి రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేపల్లె ఎబిఆర్ కళాశాల ప్రిన్సిపల్

రేపల్లె : ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరు చెట్లను నాటాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరరావు అన్నారు. కళాశాలలో ఓజోన్ పొర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఓజోన్ పొర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి బి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీనతకు గురి చేసే వాయువులైన క్లోరో ఫ్లోరో కార్బన్లు, నైట్రస్ ఆక్సైడ్ హాలో కార్బన్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ నర్సయ్య, డాక్టర్ వివి రవీంద్ర, ఎన్‌సిసి కేర్ టేకర్ బాలగురవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాహిత్యలోకంలో వెలుగుచూసిన శాసనాలు

ప్రజాశక్తి - అద్దంకి

మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలో మంగళవారం జరిపిన పరిశోధనలో క్రీస్తు శకం 1634లో తంగేడి నాయినింగారు చేయించి సేవాచారని పేర్కొనబడింది. 2వ శాసనంలో హేవలంబన సంవత్సర కార్తీక శుక్ల పౌర్ణమి సోమవారం శ్రీశైలం మొదలైన భిక్షావృత్తికి ద్రోణాలలోని వీరేశ్వర ముఖ మండపంలో కోటి వీరయ్య, అవగలం వీరయ్య, కందుకూరి కుమార రాత విజయ నారయ్య స్వామివారికి వేయించిన శాసనం బయట పడింది. ఈ శాసనంలో శ్రీశైలం వెళ్ళు భిక్షావృత్తి వారికి నిత్య అన్నదానం నిర్వహించుటకు వేయించిన శాసనమని తెలుస్తుందని చారిత్రక పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి వివరించారు. కొండపైన క్రీస్తు పూర్వం 7, 6 శతాబ్దాల


రాతి సమాధి, శాసనాలు పరిశీలిస్తున్న పురావస్తు అధికారులు

నాటి ఒక పాత శిలాయుగపు సమాధులు కనుగొనబడివున్నవి. నీటి ఆధారంగా ద్రోణాదుల ప్రాంతంలో ఏడవ శతాబ్దం నాటికే జన సంచారం ఉన్నట్లుగా ఈ శాసనాల ద్వారా తెలుస్తుందని పురావస్తు పరిశోదకులు తెలిపారు.


ఎంపి కృష్ణ ప్రసాద్‌కు విరాళం అందిస్తున్న మణికుమార్

రాఘవేంద్ర స్కూల్ రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - చీరాల

విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక పాపరాజుతోటలోని రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సేకరించిన రూ.50వేల నగదును చెక్కు రూపంలో ఎంపీ కార్యాలయంలో ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌కు అందించారు. సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి వరద బాధితులకు అండగా నిలిచిన పాఠశాల యాజమాన్యాన్ని ఎంపి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గవిని మణికుమార్, ఉపాధ్యాయులు సురేష్, సుభాని, వెంకట్, గవినివారిపాలెం పెద్దలు పాల్గొన్నారు.


నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న నక్క ఆనందబాబు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని జువ్వలపాలెంలో వరద బాధితులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సహకారంతో బియ్యం, కందిపప్పు, ఐదు కేజీల గోధుమ పిండి, కేజీ వంటనూనె వంటి పది రకాల నిత్యవసర సరుకులు శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాలు పూర్తిగా నీట మునిగి తీరని నష్టం వాటిల్లిందని అన్నారు. గతంలో ఇలాంటి వరద ఎప్పుడూ చూడలేదని అన్నారు. 11.55లక్షల క్యూసిక్కుల వరద వచ్చిందని అన్నారు. చరిత్రలో ఇదే మొదటిసారని అన్నారు. ప్రభుత్వం ముందుగా హెచ్చరించడం, అప్రమితం చేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అన్నారు. కష్ట కాలంలో దాతలు వచ్చి స్వచ్ఛందంగా ఆదుకోవడం మంచి పరిణామమని అన్నారు. ఆపదలో ఉన్న బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని దాతలను కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, ఐడిపిఎల్ గ్రూప్ చైర్మన్ వేములపల్లి రవికిరణ్, తెలుగుదేశం నాయకులు బుజ్జి, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి భాగ్యనగర్ పార్కు వాకర్స్ క్లబ్ సభ్యులు ఘన నివాళు లర్పించారు. భాగ్యనగర్ 2వ లైన్‌లోని లైన్స్ చిల్డ్రన్స్ పార్కులో సీతారాం ఏచూరి చిత్రపటానికి వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై జీవితం చివరి వరకు పోరాడిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. మెప్మా పీడీ టి.రవికుమార్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవితకాలం కమ్యూనిస్ట్‌గా కొనసాగిన ఏచూరి వివాదరహితుడుగా, అన్ని పార్టీలకు ఆమోదనీయమైన జాతీయ స్థాయి నాయకుడని తెలిపారు. కార్యక్రమంలో రాచగర్ల వెంకట్రావు, చెరుకూరి. పూర్ణచంద్రరావు, కాశీం, బెల్లంకొండ శ్రీనివాసరావు, గద్దల. వెంకటేశ్వర్లు, మద్దెల శ్రీనివాస్, లాయర్ నాయుడు, శంకర్ బాబ్జి, పుట్టంశెట్టి. బాలు, కొమ్ము రవివర్మ, కరాటే మాస్టర్ రవి, తన్నీరు గిరి, బండారు మహేష్, మేకల అంజిరెడ్డి, గుడిపాటి పెద్దబ్బాయి, టైలర్ శ్రీను, ఆంజనేయులు, బ్యాంక్ శ్రీనివాసులు, సాఫ్ట్‌వేర్ వెంకట్, జె.నారాయణరావు పాల్గొన్నారు.

అనుమతులు రాగానే దువ్వలేరుపై చెక్‌డ్యాం నిర్మాణం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 16న 'హామీలేనా..చర్యలేవీ' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దానికి మార్కాపురం కార్యనిర్వాహక ఇంజనీరు (నీటి పారుదల శాఖ) ఎస్.అబుతలీం స్పందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మురారిపల్లి గ్రామం దగ్గర దువ్వలేరు వాగుపై చెక్ డ్యాం నిర్మాణం కోసం రూ.146.20 లక్షలతో అంచనాలను నవంబర్ 2018లో పంపించామన్నారు. ఈ అంచనాలకు ఎటువంటి పాలనాపరమైన అనుమతులు రాలేదని తెలిపారు. పాలనాపరమైన అనుమతులు రాగానే దువ్వలేరు వాగుపై చెక్ డ్యాం నిర్మాణం చేపడతామని చెప్పారు.

వినాయకుడి లడ్డు రూ.లక్ష

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం 11వ రోజు నిమజ్జన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుని చేతిలో ఉన్న లడ్డు నలంద ఉన్నత పాఠశాల ఏవో మేకల రామకృష్ణారెడ్డి వేలం పాటలో రూ.లక్షకు పాడుకున్నారు. అలాగే ప్రధాన కలశంను కైపు వెంకటరెడ్డి రూ. 95 వేలకు పాడుకున్నారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు నిమజ్జన, ఊరేగింపు కార్యక్రమాలు సంధర్భంగా భక్తులకు ప్రసాదం అందించేందుకు రూ.20 వేలు అందజేశారు. కాగా యర్రగొండపాలెం పట్టణంలో నిమజ్జనానికి తరలిన చివరి విగ్రహం కావడంతో భారీ మేళతాళాలతో ఆర్కెస్ట్రాతో వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు యక్కలి భాగ్యరావు, బిజ్జం రమణారెడ్డి, పరిమి ప్రసాదరావు, పాలెం నందిరెడ్డి, వనిపెంట సాయిరెడ్డి, ఆతుకూరి కృష్టయ్య పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో శాంతిరామ్ మెడికల్ కాలేజీ మరియు జనరల్ ఆసుపత్రి నంద్యాల వారి సౌజన్యంతో మంగళవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు ఆదినారాయణ పరీక్షలు నిర్వహించారు. వంద మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. 15 మంది రోగులకు కంటి ఆపరేషన్లు చేయించేందుకు నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కాలేజీ మరియు జనరల్ ఆసుపత్రికి తరలించారు. మరో 25 మందికి త్వరలోనే తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించి కంటి అద్దాలు అందజేస్తామని తెలిపారు.

విమర్శలు మాని.. ప్రజాసమస్యలు పరిష్కరించండి

అధికార, ప్రతిపక్ష పార్టీలకు సిపిఎం నగర కమిటీ సూచన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం పక్కన పెట్టి నగరంలో ప్రజా సమస్యలు పరిష్కారం మీద దృష్టి పెట్టాలని సిపిఎం నగర కమిటి సూచించింది. ఆపార్టీ నగర కమిటి సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం మంగళవారం సుందరయ్య భవన్‌లో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి జి రమేష్ మాట్లాడుతూ నగరంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం మానాలని సూచించారు. గత పదేళ్ల నుంచి పేదలకు ఇళ్లు ఇవ్వడంలో టిడిపి, వైసిపి రెండు పార్టీలు విఫలం చెందాయని విమర్శించారు. ఇప్పటికైనా టిడ్కో లబ్ధిదారులకు ఇల్లు కేటాయించాలని కోరారు. అగ్రహారం వద్ద ఇచ్చిన పట్టాలకు పొజిషన్ చూపించాలని కోరారు. అవినీతి పేరుతో వాయిదా వేయకుండా, ఎంక్వయిరీ పేరుతో అర్హులను తొలగించకుండా చూడాలనికోరారు.



మాట్లాడుతున్న రమేష్

నగరపాలక సంస్థను అధికార పార్టీ కైవసం చేసుకొని, కౌన్సిల్ సమావేశం జరిపారని, ప్రజా సమస్యలు పరిష్కారానికి కౌన్సిల్ సమావేశాలు దోహదపడాలని సూచించారు. నగరంలో మంచినీటి సమస్య, దోమల సమస్య, మురుగు నీటి సమస్య ఉందని, ఈ సమస్యల పరిష్కారానికి అధికార పార్టీ కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అయినా ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలని అధికార పార్టీ నేతలకు సూచించారు. కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచేలా చూడాలని కోరారు. ఈసమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

45వ డివిజన్ శాఖా కార్యదర్శిగా సుబ్బారెడ్డి..

సిపిఎం 45వ డివిజన్ శాఖా కార్యదర్శిగా మడతల సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. 45వ డివిజన్ శాఖ సిపిఎం మహాసభ మంగళవారం శ్రీనగర్ కాలనీ ఒకటో లైన్‌లో జరిగింది. మహాసభ సందర్భంగా పార్టీ జెండాను డివిజన్ నాయకులు దగ్గుమాటి దశరధరామిరెడ్డి ఎగుర వేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య, మంచినీటి సమస్య, పోతురాజు కాలువ సమస్యను పరిష్కరించాలని మహాసభలో తీర్మానించారు. 45వ డివిజన్‌లో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, 45వ డివిజన్ పార్టీ నాయకులు టి భక్తసింగ్ రాజు, ఎన్ అడవయ్య, పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెలరోజులుగా నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పప్పులు, ఉప్పులు, బియ్యం ధరలు పెరగడంతో పాటు కూరగాయల ధరలు కూడా పెరిగాయని తెలిపారు. ధరల పెరుగుదలతో సామాన్యుల నడ్డి విరుగుతోందని, మధ్య తరగతి ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధరల పెరుగుదలను పత్రికలు,



మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

మీడియా ద్వారా తెలుసుకున్న కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, తద్వారా మరింత ధరలు పెరుగుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రజల ఆదాయాలు పెరగ కుండా ఒక్కసారిగా ధరలు పెరిగితే జీవనం అస్తవ్యస్థంగా మారుతుందన్నారు. ఎన్నికలకు ముందు ధరలు నియంత్రిస్తామని చెప్పిన పాలకులు పెరుగు తున్న ధరల పట్ల గుడ్లప్పగించి చూడటం సిగ్గుచేటన్నారు. పౌష్టికాహారాన్ని అందిస్తాం, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని చెబుతున్న ఆహార భద్రత చట్టం ఏమైందని ఆమె ప్రశ్నించారు. తక్షణమే ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని, కేరళ తరహాలో 16 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోక పోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, నాయకులు కె రాజేశ్వరి, బి పెద్ద గోవిందమ్మ పాల్గొన్నారు.

శాశ్వత ఆటోస్టాండ్లకు ఉత్తర్వులివ్వాలి

- ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా

ప్రజావక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో శాశ్వత ఆటో స్టాండ్‌కు ఉత్వర్వులు ఇవ్వాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ-చలానాల రద్దు ,సంక్షేమ చట్టం , పర్మినెంట్ స్టాండ్ కోసం ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో దాదాపు 20 సెంటర్‌ల్లో ఆటో కూడళ్ళు ఉన్నాయని, ఆటో స్టాండ్లు ,బోర్డులు పెట్టారు తప్ప పర్మినెంట్ ఆర్డర్స్ ఇవ్వలేదన్నారు.



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

మున్సిల్ కార్పొరేషన్ అధికారులు పర్మినెంట్ స్టాండ్ ఏర్పాటు చేసి ఆర్డర్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లాలో గుళ్ళాపల్లి సెంటర్, పేర్న మిట్ట సెంటర్ , సింగరాయకొండ సెంటర్ ఒంగోలు ఇంకా అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న పరిశ్రమలు కూడా మూతపడిన తర్వాత మూతపడిన ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు ఆటో నడుపుతున్నారన్నారు. దీంతో ఆటోలకు పోటీ ఎక్కువైందని, జీవనం చాలా దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ప్రకాశం భవనంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి ఆటో యూనియన్ మాజీ అధ్యక్షులు మహమ్మద్ బేగ్ , ఆటో యూనియన్ అద్దంకి బస్టాండ్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ బాషా , సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ ,ఒంగోలు నగర నాయకులు వెంకటేశ్వర్లు, పృధ్వి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రవాణా కార్మికులు

రవాణా కార్మికుల కోసం.. సంక్షేమ చట్టం అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం

రవాణా కార్మికుల రక్షణ కోసం సంక్షేమ చట్టం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ తీరుపై సిఐటియు ఆధ్వర్యంలో రవాణా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి మాట్లాడుతూ రవాణా రంగంపై ప్రభుత్వం విధిస్తున్న చలానాలు, జరినామాలు, రిజిస్ట్రేషన్, అదనపు పన్నులు మినహాయించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోలీసులు, ఆర్టిఏ, ప్రభుత్వ అధికారులు యూనియన్ నాయకులతో జాయింట్ మీటింగ్ జరిపి సమస్యల పరిష్కరించాలని అన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జె నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు ఎం.రామయ్య, ఎస్.కె మహబూబాషా, కే.మహేష్, ఎన్ మోజేష్, జి నగేష్, పి సుబ్బారావు, ఎన్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

19న డిసిసి అధ్యక్షులు షేక్ సైదా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా షేక్ సైదా ఈనెల 19న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పిసిసి పూర్వ అధ్యక్షులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం, మాజీ రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలీ, మాజీ ఎమ్మెల్యే బాపట్ల జిల్లా డిసిసి అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్, రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ ఈనెల 19న ఉదయం 10 గంటలకు ఒంగోలు లాయర్ పేట సాయిబాబా గుడి వద్ద ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నుండి ర్యాలీగా బయలుదేరి 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం సభ జరగనున్నట్లు సైదా తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



విశ్మకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతిని మంగళవారం అధికారికంగా నిర్వహించారు. బిసి స్టడీ సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్మకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి బిసి సంక్షేమాధికారి బి.అంజల అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వర రావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథ్ జిల్లా పర్యాటక అధికారి బెన్హార్, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.



మంత్రి సత్య ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న గీతా బందు ట్రస్ట్

వరద బాధితులకు రూ.2లక్షల విరాళం

ప్రజాశక్తి - రేపల్లె

వరద బాధితులను ఆదుకునేందుకు గౌడ సంఘం, గీతబంధు సేవా ట్రస్టు సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. సచివాలయంలో గీత బంద్ సేవ ట్రస్ట్ సభ్యులు వరద బాధితుల సహాయార్థం రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు అనేక స్వచ్ఛంద సేవా సంస్థలకు సంబంధించిన వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు.



భవిత సెంటర్‌కు కుర్చీలు బహుకరిస్తున్న ఆదిత్య

భవిత సెంటర్‌కు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

వికలాంగ విద్యార్థులకు సంబంధించిన భవిత సెంటర్ అభివృద్ధికి దాతలు సహకరించి సెంటర్‌ను బలోపేతం చేయాలని భవిత సెంటర్ ఫిజియో థెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని కోరారు. ఇందిరా ప్రియదర్శిని స్నేహితురాలు ఆదిత్య ఐదు కుర్చీలను మంగళవారం బహుకరించారు.



నష్ట పరిహార జాబితాను పరిశీలిస్తున్న రైతులు

పంట నష్టపరిహార జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - అమృతలురు

మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం పంట నష్టం తుది జాబితాను మంగళవారం ప్రదర్శించారు. రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద ఉంచినట్లు ఎఒ వి లోకేశ్వరి తెలిపారు. పంట నష్ట పరిహార జాబితాలో రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నట్లు తెలిపారు. పంట నష్టం జరిగిన వారి పేర్లు జాబితాలో లేకపోయినా ఇతర సమస్యలేమైనా పరిహారానికి సంబంధించచిన అభ్యంతరాలు తెలపవచ్చని అన్నారు. లేదా పంట నష్టం జరగకపోయినా అన్ని పొలాలకు కచ్చితంగా ఈ పంట నమోదు, ఈకెవైసీ ఈనెల 23లోగా చేయించుకోవాలని అన్నారు.

ఆలరించిన శివతాండవ నృత్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక చెనకేశవ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన శివతాండవం ప్రదర్శన ఆలరించింది. పర్చూరుకు చెందిన చిన్నారి కృష్ణంశెట్టి కుమారి వేసిన శివతాండవం ప్రశంసలు అందుకుంది. పర్చూరు, విజయవాడకు చెందిన ద్వారకప్పు లక్ష్మి నృత్య కళాకారిణి టీచర్ బృందం ఈ ప్రదర్శనలు ఇచ్చాయి. ప్రదర్శనకు ఇంకొల్లు మాజీ సర్పంచ్ బోడల శ్యాంసుందర్, అతని సోదరుడు మురళీకృష్ణ ఆర్థిక సాయం అందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛతహీ సేవ ర్యాలి ప్రారంభిస్తున్న ఎంపిడిఒ



అమృతలూరులో స్వచ్ఛత హే సేవ ర్యాలీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఎంపిడిఒ జి లక్ష్మీదేవి ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతి కుటుంబం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ నోడల్ అధికారులు, గ్రామ కార్యదర్శులు, అధికారులు, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

అమృతలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఎంపిపి రాపర్ల నరేంద్ర కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డిఎల్పిఒ, ఈఒపిఆర్ అండ్ ఆర్డి జి నరసింహరావు, కె వాణి, అధికారులు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనారు.

రేపల్లె : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించ వచ్చని మంత్రి అనగానే సత్య ప్రసాద్ సోదరులు, టిడిపి నాయకులు శివప్రసాద్ అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు రావని అన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. మండలంలోని పోటుమెరక గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కిద నిర్మించిన నూతన గృహ ప్రారంభోత్సవం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాంబశివరావు, చైర్మన్ కట్ట మంగ, వైస్ చైర్మన్ టివికె గుప్తా, హౌసింగ్ డిఇ సుబ్బారావు పాల్గొన్నారు. పట్టణాన్ని స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుదామని టిడిపి సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. స్వచ్ఛత హి సేవ పట్టణంలోని ఓల్డ్ టౌన్ అంకమ్మ చెట్టు వద్ద నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన దేశాన్ని మనమే స్వచ్ఛందంగా శుభ్రపర్చుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టారు. చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకొని అంటువ్యాధులకు దూరంగా ఉండాలని కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాంబశివరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కర్లపాలెం : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తహశీల్దారు వెంకటరత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ ఏలీషాబాబు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, రాసంశెట్టి లక్ష్మణ్, గొర్ల కమల, మండల కో ఆప్షన్ సభ్యులు మోహిద్దీన్ బేగ్, సర్పంచ్ నక్కా లలిత కుమారి, చిలకల సురేంద్ర, కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ మంగళవారం ఎంపీపీ డివి లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామంలో రోజుకి ఒక ప్రత్యేక కార్యక్రమం చొప్పున నిర్వహించి అక్టోబర్ 2నాటికి పంచాయతీలు స్వచ్ఛత గ్రామాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. తల్లి పేరుతో ఒక మొక్క ప్రతి గ్రామంలో నాటాలని కోరారు. జెడ్పిటిసి టి ఉదయ భాస్కరి మాట్లాడుతూ అంగన్‌వాడి, వైద్య సిబ్బంది బాధ్యత వహించి మహిళలకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ఎంపిడిఒ జి చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతిరోజు ఫోటోలు, సమాచారాన్ని సంబంధిత వెబ్సైట్ నందు పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఒపిఆర్డి టి ఊహారాణి, ఎఈ ఆర్డబ్ల్యూఎస్ ఎన్ శివకృష్ణ, ఏపీఎం శ్రీమన్నారాయణ, ఏపీఒ శివ పార్వతి, ఎంఈఓ నీలం దేవరాజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఫజిరున్నీసా, జె వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని 13పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ఎంపిడిఒ రాజ్యలక్ష్మి నియమించారు. 17 నుంచి నిర్వహించే కార్యక్రమాలు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులను సమన్వయం చేసుకొని నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు వీడియోలు, ఫోటోలు సంబంధిత అధికారులకు పంపించాలని కోరారు. మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపిడిఒ రాజ్యలక్ష్మి, నాగండ్ల ప్రత్యేక అధికారిగా తహశీల్దారు ఎ ప్రమీలరాణిని నియమించారు.



కర్లపాలెంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం



భట్టిప్రోలులో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ

నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం



నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాలలో మోదేపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఎంఈహెచ్ఈఓ ఎ నాగేశ్వరరావు విద్యార్థినీ విద్యార్థులకు ఆల్ బెండొజోల్ మాత్రలు 120 మంది విద్యార్థినీ విద్యార్థులకు మ్రింగించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆరోగ్య విద్య గురించి తెలిపారు. నులిపురుగుల నిర్మూలన ద్వారా రక్తహీనతను నివారించవచ్చని అన్నారు. మెరుగైన పోషకాహారాలు మన శరీరానికి అందించవచ్చని అన్నారు. విద్యార్థులకు చదువు నందు ఏకాగ్రత, బుద్ధి, వికాసం పెంపొందించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 4750 విద్యార్థుల్లో 4612 మందికి మాత్రలు మింగించారు. 97శాతం మందిగా నమోదైనట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 25లోపు మ్రింగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్, ఈఎన్‌ఎంలు భారతి, సుదిష్ణ కుమారి, ఎంఎల్‌హెచ్ పి సత్య, రమణ కుమారి, సంతోషమ్మ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల కేంద్రమైన యద్దనపూడిలోని అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు డి వార్మింగ్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణతో పిల్లలలో రక్త హీనత లేకుండా చేయవచ్చని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు నులిపురుగులు నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంగులూరు : పిల్లల్లో నులు పురుగులు నివారించి రక్తహీనత నుంచి కాపాడుదామని పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 గ్రామాలు, 14 సచివాలయాల్లో పిల్లలకు వైద్య సిబ్బంది నులు పురుగుల నివారణ మాత్రలు మంగళవారం మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదని చెప్పారు. మిగిలిన విద్యార్థులకు 25న టాబ్లెట్స్ వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు హరిబాబు, రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, ఎఎన్‌ఎంలు జానకి, రామంజమ్మ పాల్గొన్నారు.

ఇంకొల్లు : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిహెచ్సి పరిధిలో డి వార్మింగ్ బిళ్ళలు మంగళవారం పంపిణీ చేసినట్లు డాక్టర్ అంజలి, డాక్టర్ భాను ప్రకాష్ తెలిపారు. దగ్గుబాటి విద్యా సంస్థలు, నివేదిత స్కూల్ విద్యార్థులు, అంగన్‌వాడీలోని పిల్లలకు డి వార్మింగ్ బిళ్ళలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ సౌమ్య, ఎఎన్‌ఎంలు ప్రశాంతి, సుభాషిణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రవికుమార్, నివేత స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

రేపల్లె : స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండెజోల్ టాబ్లెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ కోటేశ్వరరావు, ఐక్యూ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం నర్సయ్య, కెమిస్ట్రీ అధ్యాపకులు బి కోటేశ్వరరావు, డాక్టర్ వివి రవీంద్ర, ఎన్‌సిసి కేర్ టేకర్ బాలగురవయ్య పాల్గొన్నారు.



పంగులూరులో పురుగుల మందు మింగిస్తున్న దృశ్యం



రేపల్లె డిగ్రీ కాలేజీలో నులిపురుగుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - చీరాల

ఆహార ప్రదాతగా, దేవశిల్పిగా పూజలందుకునే విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఎంఎల్ఎ కొండయ్య విశ్వకరమ్మ భగవాన్ చిత్రపటానికి పూజలు చేశారు. స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో విశ్వకర్మ జయంతి మంగళవారం నిర్వహించారు. సకల కళలకు, రకరకాల వృత్తులకు ఆద్యుడు, నాగరికతకు మూల పురుషుడైన విశ్వకర్మ జయంతి సందర్భంగా శుభం కలగాలని ఆకాక్షించారు.

అద్దంకి : పట్టణంలోని శ్రీ కమటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ విశ్వకర్మ జయంతి మహా యజ్ఞం పూర్ణాహుతి పూజలో 21 దంపతులతో మంగళవారం పూజలు నిర్వహించారు. తహశీల్దారు, టిడిపి నాయకులు కాకాని అశోక్, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, ఆడిటి రామారావు, త్రిమూర్తులు, ప్రకాశం జిల్లా కార్పెంటర్ అధ్యక్షులు తాడి రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ జిల్లా సెక్రెటరీ నరసింహచారి, దంతనాల కనక రత్నాచారి, సంఘ నాయకులు పొన్నపల్లి మల్లికార్జున్, ఆంజనేయులు, తక్కెలపాటి నాగేశ్వరావు, ఆదిమల రాంబ్రహ్మం, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, కొండముదురు రమేష్, బొప్పుడి వీరప్పయ్య, సోడా పూర్ణచంద్రరావు, చెన్నుపల్లి కోటిలింగాచారి, ఆరికట్ల వీరాచారి, అనంత మురళి, చింతలపూడి వీరయ్య, మంగళాపు విశ్వరూపచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

పంగులూరు : గాయత్రీ సమేత విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో గోవిందాంబిక సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వకర్మ చిత్రపటానికి పూల మాల వేసి అలంకరించారు. కార్యక్రమంలో పూసపాటి సాంబశివరావు, మచ్చ వెంకటేశ్వర్లు, తక్కెళ్ళపాటి రామకృష్ణ, తక్కెళ్ళ పాటి వరప్రసాద్ దంపతులు పీటలపై కూర్చొని యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మురికిపూడి ఓంకార శర్మ, మేడూరి శివరాం ప్రసాద్, మేడూరి నాగేశ్వరరావు, మచ్చ చిరంజీవి పాల్గొన్నారు.



విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బిఎస్సార్

గుంటూరు వైద్య కళాశాల 1990 బ్యాచ్‌కి చెందిన డాక్టర్ల బృందం కృష్ణానది వరద ముంపుకు గురైన పెదలంక, మధ్యగూడెం, అందార్లంక, జువ్వలపాలెం గ్రామాల్లో నిత్యవసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. చల్లపల్లి మండలం అందాలలంక ఎంపీయుపి పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు చొరవతో అమ్మదారులంక పాఠశాలలో పంపిణీ చేశారు. జిఎంసి 1990 చెందిన వైద్య మిత్ర బృందం రూ.10లక్షల విలువచేసే సరుకులు మూడు గ్రామాల ప్రజలకు పంపిణీ చేసినట్లు డాక్టర్ పీత మల్లికార్జునరాజు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యతని అన్నారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం దేవుడిచ్చిన వరమని అన్నారు. ఆ దేవుడు అందరినీ చల్లగా చూడాలని కోరారు. తాము చేసే సహాయం కొద్ది మాత్రమే అయినప్పటికీ కష్టాల్లో ఉన్నవారికి ఎంతోకొంత సహాయం చేకూరుతుందని అన్నారు. రెండు గ్రామాల్లో 500మందికి సరుకులు అంద చేశామని అన్నారు. వరద ప్రభావిత గ్రామాల నుండి తమ వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికి తాము ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. విజయవాడ డాక్టర్ పుష్పరాజ్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌కు వైద్య సహాయం కోసం రావచ్చని చెప్పారు. ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. డాక్టర్ యుగంధర్ విజయవాడ, ఏలూరుల్లోని తమ హాస్పిటల్స్‌కు వచ్చిన అందరికీ వైద్యం చేస్తామని తెలిపారు. తమకు చేతనైన సహాయం చేశామని అన్నారు. తమ గ్రామాలకు సహాయం చేయాలని హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు కష్టపడి వరదలో సైతం ఫోటోలు సేకరించి తమకు పంపించారని తెలిపారు. వారి సలహా మేరకు ఈ గ్రామాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్ కుమార్, వెంకటరమణ, పున్నరావు, సునంద పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు



తోకలవారిపాలెంలో ఫణిగోపాల్ మిత్ర బృందంచే పుస్తకాల పంపిణీ

వరదల కారణంగా మండలంలోని పెదలంక, పెసరలంక, చింతమోటు గ్రామాల్లో నష్టపోయిన పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట శ్రీనివాసరావు పుస్తకాలు, స్టేషనరీ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా లంక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని విధాల నష్టపోయారని అన్నారు. తన వంతు సహాయంగా 60 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్న బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పసుపులేటి శివరామకృష్ణ, వి సురేష్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని కిష్కిందపాలెం, తోకలవారిపాలెం, గాజులంక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తమ వంతు సహాయంగా కిష్కిందపాలెం సచివాలయంలో ఉద్యోగం చేస్తున్న పణి గోపాల్ తాను ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలోని ప్రజలు, విద్యార్థులు ఇబ్బందుల్లో ఉన్నారని భావించి తన వంతు రూ.9 వేలు, తన మిత్రుడైన ఎన్నారై వాక రవికుమార్ రూ.30వేలు, పొన్నపల్లి కళ్యాణ్ కుమార్ రూ.3వేలు కలిపి రూ.42వేలతో మూడు గ్రామాల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ టి కృష్ణమోహన్ మాట్లాడుతూ సచివాలయంలో చిన్న ఉద్యోగం చేస్తూ తాను పని చేసే ప్రాంతంలోని ప్రజల ఇబ్బందిని చూసి చెలించి అతని మిత్ర బృందంతో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో కిష్కిందపాలెం టిడిపి నాయకులు బోయపాటి తేజ, నర్రా మధు, సుంకర శ్రీను, కొత్తపల్లి శ్రీధర్, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, శ్యాంబాబు అంగనవాడి టీచర్ శారద పాల్గొన్నారు



ఇఒ సుభద్రకు చెక్కు అందజేస్తున్న దాతలు

ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - అద్దంకి, పంగులూరు

మండలంలోని సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖమండప నిర్మాణానికి జె పంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ రూ.లక్ష విలువైన చెక్కును సహాయ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి టి సుభద్రకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ పి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

పిఎంఎవై గృహాలు ప్రారంభం

ప్రజాశక్తి - మేదరమెట్ల

ప్రధాన మంత్రి మోడీ పుట్టిన రోజు సందర్భంగా కోరిసపాడు మండలంలో పి గుడిపాడు నందు మంగళవారం పిఎంఎవై పథకం ద్వారా మంజూరైన గృహాలను ఎంపిడిఒ మంచిగర్ల సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు మెహతాజ్, ఎపిఒ ఐఎస్ఎన్ కోటేశ్వరి, ఎపిఎం బి అనురాధ, హౌసింగ్ ఎఈ నటరాజ్, టిడిపి అధ్యక్షులు జాగర్లమూడి జయకృష్ణ, టిడిపి నాయకులు చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, మంద ఆమోస్ పాల్గొన్నారు.



పర్చూరులో నూతన గృహ ప్రవేశంలో అధికారులు

పర్చూరు : స్థానిక ఇందిరకాలనీలో ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద నిర్మాణం పూర్తి చేసుకున్న ఇంటికి లబ్ధిదారులకు తాళాన్ని అందజేసి గృహ ప్రవేశం శుక్రవారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు షం షుద్దిన్, పట్టణ అధ్యక్షులు ఎవి కృష్ణ, శేష బ్రహ్మాచారి, శివరాం ప్రసాద్, హుస్సేన్, నలిగల కిషోర్, శ్రీధర్, గౌస్, ఖాజావాలి, హౌసింగ్ ఇన్స్‌పెక్టర్ కుమార్, సెక్రెటరీ సుధీర్ పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం చిన్న గదెలవర్రు గ్రామంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా చిన్న గదేలవర్రు నుండి ట్రాక్టర్ల ద్వారా జువ్వలపాలెంలో గతంలో వరదలకు పశుగ్రహం కోల్పోయిన రైతులకు వంద కట్టల పశుగ్రాసాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి

- 40డిగ్రీలకుపైగా నమోదుకానున్న ఉష్ణోగ్రతలు
- మొన్న భారీ వర్షాలు, ఇప్పుడు తీవ్ర ఎండలు
- వృద్ధులు, చంటి పిల్లలతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - చీరాల

మొన్నటి వరకు భారీ వర్షాలు కురిసి నష్టం జరిగితే నేడు ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు భానుడు చల్లారడం లేదు. నాలుగు రోజుల నుండి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అత్యవసరాలు మినహా ప్రజలు ఇళ్ల వద్దనే ఉండే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఎండాకాలం వచ్చినట్లు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా జనం ఇళ్ల నుంచి బయటికి రావాలంటే హడలిపోతున్నారు. ఉదయం11 నుండి ఎండ వేడి 40డిగ్రీలు నమోదు అవుతుండడంతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఏదైనా లాంగ్ టూర్ వెకేషన్ ప్లాన్ చేసే వారు ఆరోగ్యం సూత్రాలు పాటించటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ నివారణ జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. వ్యాపారస్తులు సైతం మధ్యాహ్నం వేళలో దుకాణాలు మసివేస్తూ చల్లబడ్డాక తిరిగి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వచ్చేవాళ్లు ఉదయం లేక సాయంత్రం వేళలో మాత్రమే బయటకు వస్తున్నారు. వృద్ధులు, చంటి పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఎండల తీవ్రతతో సీతల పానియాలవైపు పరుగులు తీస్తున్నారు. వినాయక నిమజ్జనాలకు వచ్చే భక్తులు సైతం సాయంత్రం వేళల్లో ఊరేగింపులు నిర్వహిస్తున్నారు.



ఎండ ప్రభావంతో ప్రయాణం



చీర కొంగు కప్పుకొని మార్కెట్ నుండి వెళుతున్న మహిళలు



అర్జీలు స్వీకరిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తా..: వేగేశన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తూ బాపట్ల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. ఎమ్మెల్యే వేగేశన ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన వినతుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజుని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. పెన్షన్ ల కోసం వద్ధులు, వికలాంగులు, మహిళలు,ఉద్యోగాల కోసం యువత,విద్య, వైద్య సాయం కోసం సామాన్యులు, తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బాధితులు పెద్దఎత్తున తరలివచ్చారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విజ్ఞప్తి స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి ఆయా విభాగాలతో సమన్వయం చేసుకుని వీలైనంత తొందరగా అందరి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ శ్రీదేవి, ఎలక్ట్రికల్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికో ఆత్మహత్యాయత్నం?

గోప్యంగా ఉంచిన జిఎంసి యాజమాన్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఫైనలియర్ వైద్య విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన దిలీప్ కుమార్ ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. కుటుంబంలో ఆర్థిక సమస్యల కారణంగా దిలీప్ కుమార్ మంగళవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో సహచర వైద్య విద్యార్థులు దిలీప్ కుమార్‌ను వైద్యం కోసం జిజిహెచ్‌లో చేర్చారు. దిలీప్ కుమార్ ఆత్మహత్యకు యత్నించిన విషయాన్ని సహచర వైద్య విద్యార్థులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ గోప్యంగా ఉంచారు. ఈ విషయాన్ని చెప్పటానికి వైద్య విద్యార్థులు ఇష్టపడకపోవటం గమనార్హం. ప్రస్తుతం దిలీప్ కుమార్‌కు వైద్య చికిత్సలు అందిస్తుండగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

- ఆల్బెండజోల్ మాత్రలు అందేలా యాక్షన్ ప్లాన్
- విద్యార్థులతో మాత్రలు మింగించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ దిశగా విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలను స్వయంగా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు 5,96,751 మంది ఉన్నారన్నారు. వీరికి 2849 అంగన్వాడీలు, 2718 పాఠశాలలు, 233 కళాశాలలు, 95 ఇతర వత్తి విద్య సంస్థలలో 1694 ఆశాలు, 894 ఏఎన్ఎంల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, రెండు జిల్లా ఆసుపత్రుల్లోనూ ఈ మాత్రలను అందుబాటులో ఉంచామన్నారు. మంగళవారం మాత్రలు వేసుకోలేని వారు ఈనెల 25వ తేదీన కచ్చితంగా మాత్రలు వేసేలా మాప్ - అప్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని పిల్లలు, టీనేజ్ వారందరికీ కచ్చితంగా ఆల్బెండజోల్ అందేలా కార్యాచరణ రూపొందించమని కలెక్టర్ స్పష్టం చేశారు. నులిపురుగుల బారిన పడిన వారిలో ఆకలి మందగించి రక్తహీనత వస్తుందని, ఫలితంగా నీరసంగా ఉండి చదువు, ఇతర ఏ పని పైనా ఏకాగ్రత పెట్టలేరని ఆమె తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వేయడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పైన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ఆర్‌బిఎస్‌కె నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి, డిఐఒ డాక్టర్ పద్మజ, డిపిఎంఒ వాణిశ్రీ, ఒంగోలు కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మనీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి..

విద్యను చేరువ చేసిన 'జార్జి'

- జార్జి ఆశయ సాధనలో వెనక్కి తగ్గం
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

వెనకబడిన పశ్చిమ ప్రకాశానికి ఉన్నత విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో జార్జి విద్యా సంస్థలు స్థాపించటం జరిగిందని, ఆ క్రమంలో బడుగు, బలహీన వర్గాలకు తమ విద్యా సంస్థల ద్వారా ప్రయోజనం చేకూరుతుందని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. కీర్తిశేషులు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి 18వ వర్ధంతి, జార్జి స్మృతి-2024ని పురస్కరించుకుని మార్కాపురం సమీపంలోని దరిమడుగు గ్రామం పరిధిలోని 'శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కాలేజీ'లో మంగళవారం జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో డాక్టర్ సురేష్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ జార్జి సమాధి వద్ద మాజీ మంత్రి డాక్టర్ సురేష్‌తో పాటు ఆయన సతీమణి ఆదాయపన్ను శాఖ కమిషనర్ విజయలక్ష్మిలు ఘన నివాళులు అర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరు సురేష్ మాట్లాడుతూ జార్జి ఆశయ సాధనకు కషి చేసి జార్జి విద్యాసంస్థల ద్వారా పేదలకు ఉన్నత విద్యను మరింత చేరువ చేస్తామన్నారు. ఈ క్రమంలోనే జార్జి ఇంజనీరింగ్ కళాశాలకు 'ఎన్ఎఎసి' గుర్తింపు రావడం సంతోషంగా ఉందని, కళాశాలను రాబోయే సంత్సరాల్లో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి తీసుకు పోవడానికి కషి చేస్తున్నామన్నారు. జార్జి విద్యా సంస్థలపై ఈ ప్రాంత ప్రజలు చూపుతున్న అభిమానానికి కత్జతలు తెలిపారు. కళాశాల అభివద్ధికి శాయశక్తులా కషి చేస్తానన్నారు. అనంతరం కళాశాలలోనీ శామ్యూల్ జార్జి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు, శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, డీన్ డాక్టర్ ఎం.మస్తానయ్య, పాస్టర్ ఆంద్రుస్, ఫాథర్ జాన్ అరోమ్, రెవరెండ్ సిహెచ్ యేసు దాసు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, జార్జి విద్యా సంస్థల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



జార్జి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సురేష్, విజయలక్ష్మి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుగోపాల్

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా వేణుగోపాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా డాక్టర్ వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి లభించడంతో బాపట్లకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు ఎన్‌టిఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో వేణుగోపాల్ భాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

'స్వచ్ఛతా హీ సేవ' అవగాహన ర్యాలీ

ప్రారంభించిన కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పరిసరాల పరిశుభ్రత జీవన విధానంలో ఒక భాగం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా 'స్వచ్ఛతా హీ సేవ' పేరుతో మంగళవారం ప్రకాశం భవనం నుంచి మినీ స్టేడియం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మినీ స్టేడియం వరకు 1.8 కిలోమీటర్లు సాగిన ఈ ర్యాలీని ముందుండి ఆమె నడిపించారు. మెప్మా, పంచాయతీరాజ్, ఒం గోలు నగర పాలక సంస్థ సిబ్బంది, విద్యార్థులు సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొన్నారు. మినీ స్టేడియంలో వారితో మానవ హారం ఏర్పాటు చేయించి వ్యక్తిగత పరిసరాలు, పరిశుభ్రతకు తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అంశాలపై ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అక్టోబర్ 1వ తేదీ వరకు స్వభావ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ లోకేశ్వరరావు మెప్మా పీడీ రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, డిపిఒ ఉషా రాణి, డిప్యూటీ డిఇఒ సామా సుబ్బారావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాల లోపంపై ప్రత్యేక దృష్టి

అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలు ఎవరూ పోషకాహార లోపంతో బాధపడకూడదని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేవారు. ఇలాంటి వారిని గుర్తించి పయస్సుకు తగినట్లు ఎత్తు, బరువు ఉండేలా తగిన ఆహారం అందించాలన్నారు. ఐసిడిఎస్ అధికారులతో మంగళవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఎత్తు, బరువులను లెక్కించటంలో అవసరమైతే అంగన్‌వాడీ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉద్దేశపూర్వకంగా విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యవేక్షణ లోపం ఉంటే సిడిపిఒలపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్

ప్రజాశక్తి-మార్కాపురం

పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా తీసుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ కోరారు. 'స్వచ్ఛత హి సేవ'పై మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కూడా చీపురుపట్టి.. రహదారులను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యధిక రోగాలకు అపరిశుభ్రతే కారణమన్నారు. ఇంటిలోనే కాదు... పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు ఆవాసాలుగా ఏర్పరచుకుని డెంగీ లాంటి ప్రమాదకర విష జ్వరాలు ప్రభలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిలోని వ్యర్థాలను ఎక్కడి పడితే అక్కడ వేయరాద న్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త బండ్లలో వేయాలని సూచించారు. ఇంటిలోని వృథా నీటిని రహదారులపైకి పంపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు, మాజీ జడ్‌పిటిసి కందుల రామిరెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిడిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, టిడిపి నాయకులు పి.రాంబాబు, జనసేన నాయకులు తిరుమలశెట్టి వీరయ్య, సయ్యద్ సాధిక్ పాల్గొన్నారు.



రహదారులు శుభ్రం చేస్తున్న సబ్ కలెక్టర్